క్లుప్తంగా

రీ సర్వే పరిశీలన



బొల్లవరం(ముప్పాళ్ళ): మండలంలోని బొల్లవరం గ్రామంలో జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంలో భాగంగా జరుగుతున్న రీసర్వే ప్రక్రియను తహసీల్దార్ ఎం.భవానీశంకర్ మంగళవారం పరిశీలించారు. మొదటి విడతగా ఎంపిక చేసిన ఆరు గ్రామాల్లో రెండు గ్రామాల్లో సర్వే ప్రక్రియ పూర్తయిందని, మిగిలిన గ్రామాల్లోను జరుగుతుందన్నారు. రెండు గ్రామాల్లో చివరి దశలో ఉందన్నారు. సర్వే చేసిన భూములకు సంబంధించి వివరాలపై భూయజమానులకు తెలియజేసి వారి నుంచి అభ్యంతరాలు స్వీకరించటం జరుగుతుందన్నారు. పూర్తయిన సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తహసీల్దార్ సర్వే సిబ్బందికి సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, మండల సర్వేయర్ శ్రీకాంత్, వీఆర్వో సంజీవరావు, సర్వే సిబ్బంది ఉన్నారు.

మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

సత్తెనపల్లి: మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, అధిక ధరలు తగ్గించి రేషన్ షాపుల ద్వారా బియ్యం, కందిపప్పుతో పాటు అన్ని ఇతర వస్తువులను పంపిణీ చేయాలని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ డిమాండ్ చేశారు. సీపీఎం చేపట్టిన ప్రజా రక్షణభేరి 5వ రోజు మంగళవారం బైక్ ర్యాలీతో పట్టణంలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ ర్యాలీ పట్టణంలోని వెంగళరెడ్డినగర్, రఘురాంనగర్, నాగార్జుననగర్, 24వ వార్డు, సాసైటీ ఏరియా, వావిలాల నగర్‌లో పర్యటించి, స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. సీపీఎం పట్టణ కార్యదర్శి ధరణికోట విమల, నాయకులు పాల్గొన్నారు.

నేడు గోరంట్లలో గడప గడపకు మన ప్రభుత్వం

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు సత్తెనపల్లి మండలం గోరంట్ల గ్రామంలో జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, పార్టీ శ్రేణులు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.

పండుగల వేళ పారాహుషార్

సత్తెనపల్లి డీఎస్పీ ఆదినారాయణ

సత్తెనపల్లి: దసరా పండుగ సెలవుల నేపథ్యంలో చోరీలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీస్ యంత్రాంగం చర్యలు చేపడుతుందని సత్తెనపల్లి డీఎస్పీ బి.ఆదినారాయణ అన్నారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని పట్టణం, మండల కేంద్రాలు, గ్రామాల నుంచి కుటుంబ సమేతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలన్నారు ముఖ్యంగా దొంగతనాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను, సూచనలను ప్రతిఒక్కరు పాటించాలన్నారు.

కోడిపందేల నిర్వాహకులు అరెస్ట్

నకరికల్లు: రహస్యంగా కోడిపందేలు నిర్వహిస్తున్న స్థావరంపై దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ ఎ.బాలకృష్ణ మంగళవారం తెలిపారు. మండలంలోని త్రిపురాపురం గ్రామశివారులో కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందిందన్నారు. ఈ మేరకు దాడులు నిర్వహించి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని అన్నారు. వారి వద్ద నుంచి రెండు కోడిపుంజులు, రూ4,630లు నగదు సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పాడిరైతులకు రుణాలు మంజూరు

శావల్యాపురం: జగనన్న పాలవెల్లువ కార్యక్రమంలో భాగంగా పాడి రైతులు అభ్యున్నతికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజరు ఇలింద్రపర్తి విశ్వనాథ్ అన్నారు. మంగళవారం స్థానిక బ్రాంచ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జగనన్న పాల వెల్లువ కార్యక్రమంలో భాగంగా రైతు ఆదాయం ఆధారంగా ఒక్కో రైతుకు రూ. లక్ష నుంచి 2 లక్షల వరకు రుణాలు తక్కువ వడ్డీకు ఇస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు 750 మంది అర్హత కలిగిన కల్గిన రైతులకు రుణాలను మంజూరు చేశామని, ఈనెలలో అత్యధికంగా ఇప్పటి వరకు 200 మంది రైతులకు రుణాలను మంజూరు చేశామన్నారు. 7వ జగనన్న తోడు పథకంలో భాగంగా చిరువ్యాపారులకు బ్రాంచ్ పరిధిలోని పలు గ్రామాల్లోని లబ్ధిదారులకు 250 మంది లబ్ధిదారులకు రుణాలను వారి బ్యాంకు ఖాతాల్లోకి జమ చేశామన్నారు. ఆయనతో పాటు ఫీల్డ్ ఆఫీసర్ గుబ్బల సుధీర్‌బాబు, ప్రదీప్ చంద్ర, రామిరెడ్డి తదితరులు ఉన్నారు.

ఆరోగ్య సురక్ష దేశానికే ఆదర్శం

- ఇంతలా ప్రజల మేలు కోరే ప్రభుత్వం ఎక్కడా లేదు
- జగనన్నది పక్షపాత రహిత పాలన అని గుండెలపై చేయివేసుకొని చెప్తా
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- నర్సింగపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభించిన మంత్రి అంబటి



నర్సింగపాడు వైద్యశిబిరంలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్ పంపిణీ చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

నకరికల్లు: మాకు ఓటు వేసినా, వేయకున్నా... ఇతర పార్టీలకు ఓటువేసిన వారైనా అర్హత ఉంటే చాలు పథకాలు అందిస్తూ నిష్పక్షపాతమైన పరిపాలన చేస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం మాత్రమేనని గుండెలపై చేయివేసుకొని చెప్తానని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. మండలంలోని నర్సింగపాడు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. కుటుంబ పోషణకోసం పనుల్లో నిమగ్నమై అనుకోని పరిస్థితుల్లో అనారోగ్యం పాలవుతున్న ప్రతిఒక్కరి ఆరోగ్యాన్ని కాపాడేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఉపయోగపడుతుందని అన్నారు. దేశంలో ఏ ప్రభుత్వమూ ఇలాంటి కార్యక్రమం నిర్వహించలేదన్నారు. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటే ఆ సమాజం శక్తివంతంగా ఉంటుందని విశ్వసించిన గొప్ప ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ప్రతి కుటుంబంలోను ఉన్నత విద్యావంతులు ఉండాలని నాడు–నేడు రూపంలో ప్రభుత్వ విద్యను కార్పొరేట్‌ను మించి తీర్చిదిద్దారని అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ప్రతి ఆరుమాసాలకు ఒకసారి జరుగుతుందని ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష అని కొనియాడారు.

కంటిపరీక్షలు చేయించుకున్న మంత్రి..

మండలంలోని నర్సింగపాడు గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు కంటి పరీక్షలు చేయించుకున్నారు. కళ్లజోడు అద్దాల పవర్‌ను చెక్ చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019లో ఎన్నికలకు ముందు డాక్టర్ వైఎస్సార్ కంటివెలుగు పేరుతో నియోజకవర్గంలో 20వేల మందికి పైగా ఉచిత కంటిపరీక్షలు నిర్వహించి తన సొంతఖర్చులతో 20వేల మందికి కళ్లజోళ్లు పంపిణీ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. కంటిచూపులో చిన్నపాటి లోపాలున్నా, కంటి సమస్యలు ఉన్నా వెంటనే వైద్యులను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. డాక్టర్ వి.శ్రీనునాయక్, డాక్టర్ పూజశ్రీ, డాక్టర్ నాజియా, డాక్టర్ ప్రవల్లిక, ఆప్తమాలజిస్ట్ ఎ.శ్రీను తదితరులు సుమారు 300మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు జూనెబోయిన హరీష్, వైస్ ఎంపీపీ మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ సంగు రామకోటమ్మ, సంగు శివారెడ్డి, కొండా సుధాకర్‌రెడ్డి, జింకల లక్ష్మీరెడ్డి, ఆవుల వెంకటస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కస్తలలో 331 మందికి పరీక్షలు..

అచ్చంపేట: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని చింతపల్లి సచివాలయ పరిధిలో గురువారం నిర్వహించిన వైద్యశిబిరంలో 321మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 95 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 80 మందిని కళ్లజోళ్లకు ఎంపిక చేశారు. 13 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ పరిధిలో వైద్యశాలలకు రిఫర్ చేశారు. పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఎం.ఇన్నారావు, డాక్టర్ రాంబాబు, స్పెషలిస్ట్ వైద్యులు డాక్టర్ ఎస్.ప్రేమ, డాక్టర్ ఎస్.గిరిరాజు తదితరులు వైద్యపరీక్షలు నిర్వహించిన వారిలో ఉన్నారు. గ్రామ సర్పంచ్ షేక్ మహబూబ్ సుభాని, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ చెన్నుమల్లు రవి, షేక్ జాన్‌పీరా పాల్గొన్నారు.

లింగాపురంలో 532 మందికి వైద్య పరీక్షలు...

అమరావతి: మండల పరిధిలోని లింగాపురం గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంగళవారంఎంపీపీ మేకల హనుమంతరావు ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ పేదలందరికీ కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలని, అలాగే ప్రాథమిక వైద్యసేవలు ప్రజల ఇళ్ల ముంగిటకు తేవాలనే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన రెడ్డి ప్రవేశపెట్టారన్నారు. అత్తలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి శివరత్నకుమార్ మాట్లాడుతూ 532 మంది రోగులను పరీక్షించి రోగులకు మందులు ఉచితంగా పంపిణీ చేశామన్నారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావుతో పాటుగా ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

నాగవరంలో 402 మందికి పరీక్షలు...

నాగవరం(క్రోసూరు): మండలంలోని నాగవరం గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్యసురక్ష హెల్త్‌క్యాంపులో 402 మంది రోగులకు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరంలో జనరల్ వైద్యులు డాక్టర్ ఎం.విశ్వనాథ్, ఆర్థో డాక్టర్ కె.శ్రీనివాసరావు, పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ బాల అంకమ్మబాయి, డాక్టర్ మహ్మద్ సాద్ పాల్గొన్నారు. ఎల్‌పీహెచ్‌ఓ శివుడు, ఎంపీడీఓ బి.మహేష్, పంచాయతీ విస్తరణాధికారి పి.శివరామయ్య, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వెలది అప్పారావు, ఎంపీపీ పి.కోటయ్య పాల్గొన్నారు.



నర్సింగపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లతో గ్రామస్తులు



లింగాపురంలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది



కస్తలలో కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కట్టమూరులో 420 మందికి పరీక్షలు..

సత్తెనపల్లి: ప్రజల చెంతకే మెరుగైన వైద్యసేవలను చేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని సర్పంచ్ దార్ల సంధ్య అన్నారు. సత్తెనపల్లి మండలం కట్టమూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఎంపీటీసీ గోపయ్య, ఎంపీడీవో జీవీ సత్యనారాయణలు మాట్లాడారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ యు.ఎస్.ఎల్.కవిత, డాక్టర్ ఎస్‌వీఎన్ సాయి తేజరెడ్డి, డాక్టర్ టి.సమ్మయ్య, డాక్టర్ అక్షయలు 420 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మెరుగైన వైద్యం కోసం 14 మందిని ఉన్నత ఆసుపత్రులకు రిఫర్ చేశారు. ఆప్తమాలజిస్ట్ ఎం.కాశీబాబు 118 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి, 88 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. 12 మందికి కాటరాక్ట్ వైద్యసేవల నిమిత్తం సిఫార్సు చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో న్యూట్రిషన్ స్టాల్ ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు పృథ్వీరాజ్, దార్ల ఏడుకొండలు, దావీదు, రోశయ్య, వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

లోఓల్టేజీ సమస్య పరిష్కరించాలని మంత్రి ఆదేశం..

నకరికల్లు: మండలంలోని నర్సింగపాడు గ్రామంలో వ్యవసాయానికి అందిస్తున్న విద్యుత్‌లో లోఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి అంబటిని కలసిన పలువురు రైతులు పొలాలకు లోఓల్టేజీ సమస్య వస్తుందని ఫలితంగా మోటార్లు కాలిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన మంత్రి అంబటి విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులతో అప్పటికప్పుడే ఫోన్‌లో మాట్లాడుతూ లోఓల్టేజీ సమస్యకు కారణాలను గుర్తించి నివేదిక ఇవ్వాలని అలాగే సమస్యను సత్వరమే పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ అధికారులు మాట్లాడుతూ పాతలైన్ల స్థానంలో నూతనలైన్లు ఏర్పాటు చేసి ఆధునీకీకరిస్తున్నామని భవిష్యత్‌లో శాశ్వతంగా రైతులకు లోఓల్టేజీ సమస్య రాకుండా పనులు జరుగుతున్నాయని మంత్రి దృష్టికి తెచ్చారు.

సాగర్ జలాలను తాగునీటి చెరువులకు మాత్రమే నింపాలి

సత్తెనపల్లి: సాగర్ జలాలను తాగునీటి చెరువులకు మాత్రమే నింపుకోవాలని ఎన్ఎస్పీ ఈఈ మురళీధర్ చెప్పారు. మంగళవారం జీబీసీలో నీటి ప్రవాహాన్ని ఆయన పరిశీలించి సిబ్బందితో కాలువలపై పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ మురళీధర్ మాట్లాడుతూ నాగార్జునసాగర్ కుడి కాలువ నుంచి విడుదల చేసిన సాగర్ జలాలను వృథా కాకుండా తాగునీటి చెరువులు నింపుకోవాలన్నారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయనతోపాటు ఏఈ సుందరరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ శంకర్, లస్కర్లు ప్రకాష్, వెంకటేశ్వర్లు, కొండలు ఉన్నారు.

బాల్యవివాహాల నిరోధంపై అవగాహన

పీసపాడు(క్రోసూరు): మండలంలోని పీసపాడు గ్రామంలోని బీసీ కాలనీ అంగన్‌వాడీ సెంటర్ వద్ద రక్తహీనత, బాల్యవివాహాలపై కిషోర బాలికలు, తల్లులకు అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా పాల్గొన్న పంచాయతీ విస్తరణాధికారి పి.శివరామయ్య మాట్లాడుతూ యుక్తవయస్సు బాలికల్లో రక్తహీనత లోపాలు లేకుండా మంచి పుష్టికరమైన ఆహారం తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో అందించే పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అదే విధంగా బాల్య వివాహాలను ఎవరూ ప్రోత్సహించకూడదని అన్నారు. బాల్యవివాహాలు చేస్తున్నట్లు సమాచారం తెలిస్తే మండలంలోని అన్నిస్థాయి అధికారులకు ఫోన్ ద్వారా తెలియచేయవచ్చునన్నారు. ఐసీడీఎస్, అంగన్‌వాడీ వర్కర్, ఎంపీడీఓ, తహసీల్దార్, ఎస్ఐలలో ఎవరూ అందుబాటులో ఉంటేవారికి ఫోను చేసి సమాచారం అందించవచ్చన్నారు. పీసపాడు సబ్‌సెంటర్ ఏఎన్ఎం రాజేశ్వరి, తల్లులు, కిషోరబాలికలు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడు సుధాకర్‌కు సత్కారం

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా రెండవసారి నియమితులైన గర్నెపూడి అలెగ్జాండర్ సుధాకర్‌ను సత్తెనపల్లి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుక్క చంద్ర పాల్ ఆధ్వర్యంలో మంగళవారం సత్కరించారు. పార్టీ బలోపేతానికి, సమర్థవంతంగా పని చేయడం వల్ల రెండవ సారి అవకాశం కల్పించారని పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. పీసీసీ కార్యదర్శి మాదొట్టి వేదాద్రి, పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరి జ్ఞాన రాజ్ పాల్, తదితరులు ఉన్నారు.

అన్నపూర్ణగా జగన్మాత దర్శనం



సత్తెనపల్లిలో అన్నపూర్ణాదేవిగా వాసవి మాత



పెద్దమక్కెనలో గాయత్రీ దేవిగా..



నర్సింగపాడులో వైష్ణవీదేవి అలంకారంలో అమ్మవారు



చాగంటివారిపాలెంలో అన్నపూర్ణ దేవి అలంకారంలో



అన్నపూర్ణ దేవి అవతారంలో అంకమ్మతల్లి

- అమ్మవార్ల ఆలయాలకు తరలి వచ్చిన భక్తజనం
- ఊరు వాడా వైభవంగా సాగుతున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



వడ్డవల్లి పోలేరమ్మ గుడి వద్ద గౌరమ్మకు పూజలు చేస్తున్న మహిళలు



అచ్చంపేటలో లలితా దేవిగా..



పెదకూరపాడులో అన్నపూర్ణ దేవిగా..

సత్తెనపల్లి: నవరాత్రి ఉత్సవాలు నియోజకవర్గంలో మంగళవారం వైభవంగా కొనసాగాయి. జగన్మాతను దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు ఆలయాల వద్దకు బారులు తీరారు. పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం, సనారి వీరబ్రహ్మేంద్ర ఆశ్రమం, వడ్డవల్లి పీర్ల చావిడి వద్ద అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. త్రిశక్తి దుర్గా పీఠం నందు, వెంకటపతి కాలనీలోని నీలంపాటి శ్రీ లక్ష్మీ అమ్మవారి పీఠం నందు అమ్మవారిని గాయత్రీ దేవిగా అలంకరించారు. పెద్దమక్కెన గ్రామంలోని గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయంలో గాయత్రీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని వడ్డవల్లి పోలేరమ్మ గుడి వద్ద గౌరమ్మకు మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

వైష్ణవీదేవి అలంకారంలో...

నకరికల్లు: శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా మండలంలోని శిబి చక్రవర్తి కాలంనాటి చారిత్రాత్మక ఆలయం కపోతేశ్వరస్వామి ఆలయం, నర్సింగపాడులోని అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరాలయంలో, మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి వారి ఆలయాల్లో అమ్మవారు మంగళవారం వైష్ణవీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

అన్నపూర్ణాదేవిగా అంకమ్మతల్లి ..

రాజుపాలెం: రాజుపాలెం అంకమ్మతల్లి దేవాలయంలో అమ్మవారు అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పూజారులు అర్వపల్లి కోటినారాయణ, అర్వపల్లి ఫణిశర్మలు అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. శ్రీవైష్ణవ హరిదాసుల బృందం భజన కార్యక్రమం నిర్వహించారు.

అన్నపూర్ణాదేవి అలంకారంలో...

ముప్పాళ్ళ: మండలంలోని పలు శివాలయాల్లో దేవీ శరన్నరాత్రుల ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. చాగంటివారిపాలెంలోని ఏర్పాటు చేసిన మండపంలోను, ముప్పాళ్ళలోని అన్నపూర్ణ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలోను, లంకెలకూరపాడులోని గంగా పార్వతి సమేత ఓంకారేశ్వరస్వామి ఆలయంలోను, నార్నెపాడులోని శంభులింగేశ్వరస్వామి ఆలయంలోను, మాదలలోని సంగమేశ్వరస్వామి ఆలయాల్లోను అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు.

లలితాదేవిగా కన్యకాపరమేశ్వరి..

అచ్చంపేట: స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో వాసవీమాత లలితాదేవిగా మంగళవారం మూడవరోజు భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య మహిళా విభాగం వారిచే లలిత, కన్యకాపరమేశ్వరి అమ్మవారి సహస్ర, అష్టోత్తర శతనామపారాయణం జరిగింది. సీతారామస్వామివారి దేవాలయంలో ఆధ్వర్యంలో అమ్మవారు భక్తులకు ఐశ్వర్యలక్ష్మిగా దర్శనమిచ్చారు.

అన్నపూర్ణాదేవిగా అమ్మవారు..

పెదకూరపాడు: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మూడోరోజు 75 త్యాళ్లూరులోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. దాతలు వి.శ్రీనివాసరెడ్డి, పార్వతి, చెన్నారెడ్డి, జయరామిరెడ్డి, పద్మ దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పెదకూరపాడులోని బొమ్మల గుడి వద్ద అమ్మవారు అన్నపూర్ణాదేవిగా మూడోరోజు భక్తులకు దర్శనం ఇచ్చారు.

అన్నపూర్ణా దేవిగా..

బెల్లంకొండ: దసరా శరన్నవరాత్రుల మహోత్సవాలలో భాగంగా మండల కేంద్రంలోని మహాలక్ష్మీ పీఠంలో మంగళవారం అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి మూడవ రూపం అన్నపూర్ణాదేవి అవతారమని శతాధిక ప్రతిష్టాచార్య పులుపుల వేంకట ఫణికుమార శర్మ తెలిపారు. అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. నాగిరెడ్డిపాలెం గ్రామంలో దుర్గామాత ఆలయంలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ప్రజాభ్యుదయమే ప్రభుత్వ ఆకాంక్ష

గడప గడపకు మన ప్రభుత్వంలో మంత్రి అంబటి రాంబాబు



కట్టమూరులో మహిళకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: ప్రజా సంక్షేమంతో పాటు రాష్ట్రాభివృద్ధికి విశేష కృషి చేస్తూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ పేదరిక నిర్మూలమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన దక్షత ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుందని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సత్తెనపల్లి మండలం కట్టమూరులో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ సర్వజన సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వ పాలన సాగుతుందన్నారు. కులాలు, మతాలు, వర్గాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ వారిని ఆర్థికంగా ఆదుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ఆ కుటుంబానికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల గురించి వివరించి వారికి చేకూరిన లబ్ధి పత్రాలను పంపిణీ చేశారు. మాజీ శాసనసభ్యుడు యర్రం వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబులు మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో ఆ పార్టీ నేతలు, జన్మభూమి కమిటీలు సూచించిన వారికే పథకాలు దక్కే వన్నారు. ఇప్పుడు అలా కాదని అర్హులై ఉంటే చాలని పథకాలు వారి వద్దకే వస్తున్నా యన్నారు. మంత్రి అంబటి రాంబాబు 325 నివాసాలను సందర్శించి స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, వ్యవసాయ సలహా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్ళం విజయభాస్కర్ రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలుకా జైపాల్, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, తాలూకా తెలగ సంఘ అధ్యక్షుడు ఆకుల శివయ్య, సర్పంచ్ దార్ల సంధ్య, ఎంపీటీసీ గోపయ్య, నాయకులు దావీదు, తేళ్ళూరి రోశయ్య, మాగంటి నరసింహారావు, పృధ్వీరాజ్, మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జాన్ డేవిడ్ సేవలు ఎంతో విలువైనవి



జాన్‌డేవిడ్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

చిలకలూరిపేట: సమాజంలోని వివిధ వర్గాలకు డాక్టర్ జాన్‌డేవిడ్ అందించిన సేవలు ఎంతో విలువైనవని ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ అరుణ్ కుమార్ మహంతి చెప్పారు. ఏఎంజీ, ఫార్‌కార్నర్స్, వేద సంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ జాన్ డేవిడ్ జయంతిని మంగళవారం నిర్వహించారు. ముందుగా ఏఎంజీ సమీపంలోని డాక్టర్ జాన్ డేవిడ్ సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఉన్న డాక్టర్ జాన్‌డేవిడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఏఎంజీ సంస్థ సీఏఓ మాశిలామణి, కార్మెల్ గాస్పెల్ మినిస్ట్రీస్ కు చెందిన కె.పరిశుద్ధరావు పాల్గొన్నారు.

వెలుగులు నింపాలి

చిలకలూరిపేట: పండుగలు పేద పిల్లల జీవితాల్లో వెలుగులు నింపాలని ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మ చెప్పారు. సంస్థ ఆధ్వర్యంలో దసరా పండుగ సందర్భంగా 60 మంది పేద పిల్లలకు రూ. 30 వేలు విలువ చేసే కొత్త బట్టలు, పండ్లు, బిస్కెట్లు, చాక్లెట్లు మంగళవారం పంపిణీ చేశారు.

మస్టర్లలో కూలీల సంతకాలు ఉండాలి

పెదకూరపాడులో సామాజిక తనిఖీ ప్రజావేదిక

పెదకూరపాడు: మస్టర్లలో కూలీల సంతకాలు, డిమాండ్ లేకుండా పనులు చేయించడం వంటి లోపాలను సరిచూసుకోవాలని సామాజిక తనిఖీ బృందం ప్రాసెసింగ్ అధికారి సురేంద్ర సూచించారు. మంగళవారం పెదకూరపాడులోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో 2022–23 సంవత్సరానికి సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ నిధులు పారదర్శంగా వినియోగించడంతో పాటు కూలీల హక్కుల రక్షణకు సామాజిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. మండలంలోని 20 గ్రామ పంచాయతీలకు గానూ ఉపాధి హామీ పథకం ద్వారా 1479 పనులకు సంబంధించి రూ.6.31 కోట్లు, మెటీరియల్ రూపంలో రూ.16.61లక్షలు చొప్పున మొత్తం 1504 పనులకు రూ.60.44లక్షలు ఖర్చు చేసినట్లు తెలిపారు. స్కూల్ కాంపౌండ్ వాల్స్ నిర్మాణం, వేజ్ మెటీరియల్ రూపంలో రూ.16.61లక్షలు, మొత్తం 1504 పనులకు సంబంధించి మెటీరియల్, వేజ్ రూపంలో రూ.7.23కోట్లు ఖర్చు చేసినట్లు నివేదికలో చదివి వినిపించారు. పలు గ్రామాల్లో మస్టర్లలో సంతకాలు లేవని, డిమాండ్ లేకుండా పనులు కల్పించినట్లు గుర్తించామన్నారు. ఇలా చేసిన వారికి రూ.15వేలు జరిమానా వేసినట్లు తెలిపారు. ఏపీడీ నారాయణ, జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి, ఎస్ఆర్‌పీ బుజ్జి, ఎంపీడీఓ నరసింహారావు, ఏపీఓ కోటేశ్వరరావులు పాల్గొన్నారు.